## క్లుప్తంగా

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 12 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

నర్సీపట్నం: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 12 అర్జీలు వచ్చాయని ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలు, ఆన్‌లైన్ ఫిర్యాదులు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు తదితర అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులకు జవాబుదారిగా వ్యవహరించాలని ఆర్డీవో ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని, పరిష్కారించడానికి వీలుపడని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### కుల వివక్ష లేని సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న గంగునాయుడు

కె.కోటపాడు: కుల వివక్ష లేకుండా ప్రజలంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని ఎ.కోడూరు సమీకృత వసతి గృహాధికారి పి.గంగునాయుడు తెలిపారు. సోమవారం కె.సంతపాలెంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డాక్టరు బీఆర్ అంబేడ్కర్ అన్ని వర్గాల వారికి మేలైన రాజ్యాంగం రూపొందించారన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహంతో మంచి చదువులతో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వసతి గృహాధికారి రమేష్, రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.జ్యోతి ప్రియాంక పాల్గొన్నారు.

### కె.జె.పురంలో పల్లె వనం



చెరువు గట్టున మొక్కలు నాటుతున్న సర్పంచ్ రమణబాబు, ఎంపీటీసీ శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: పల్లె వనం కార్యక్రమంలో భాగంగా కె.జె.పురంలో కరణం గారి చెరువు గట్టున కొబ్బరి మొక్కలను సోమవారం నాటారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 80 కొబ్బరి మొక్కలను సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు నాటారు. వీఆర్పీ శ్రీనివాసరావు, నాయకులు రాపేట జోగినాయుడు, శరగడం ఆదిబాబు, దాడి రామలక్ష్మణరావు, చిన్నం దాలిబాబు, మద్దాల రామకృష్ణ, పాల్గొన్నారు.

### స్వయం ఉపాధి దిశగా మహిళలు



మెప్మా బజార్‌లో వస్తువులను కొనుగోలు చేస్తున్న మహిళలు

నర్సీపట్నం: స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ డ్వాక్రా మహిళలు తయారు చేసిన చీరలు, వస్త్రాలు, బొమ్మలు, గృహోపరణాలు, తినిబండారాలు, వివిధ రకాల ఉత్పత్తులను విక్రయించారు. ఈ సందర్భంగా మెప్మా క్లస్టర్ ఆఫీసర్ రమాదేవి మాట్లాడుతూ మెప్మా ద్వారా డ్వాక్రా మహిళల స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాలతో మెప్మా బజార్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీరి తయారు చేసిన ఉత్పత్తులను ప్రజలకు తక్కువ ధరకే విక్రయిస్తూ కొద్దిపాటి లాభాలు పొంది స్వయం ఉపాధి దిశగా సాగుతున్నారన్నారు. మహిళల అభ్యున్నతి, ఆర్థిక భరోసా కోసం మెప్మా కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మెప్మా బజార్‌ను ప్రోత్సహించాలన్నారు.



# ప్రమాద ఘంటికలు



జానకిరాంపురం మార్గంలో శిథిలమైన గోడ



కొండపాలెం కూడలి వద్ద శిథిలమైన మదుము రక్షణ గోడ

- శిథిలమైన మదుములు
- కానరాని రక్షణ గోడలు
- తరచూ ప్రమాదాలు
- పట్టని అధికారులు



కొమరవోలు మార్గంలో కోతకు గురయిన రోడ్డు

రోలుగుంట: మదుములు ధ్వంసమవడంతోపాటు వాటికి రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణికుల ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని శరభవరం నుంచి కుసుర్లపూడి మీదుగా జె.పి.అగ్రహారం వెళ్లే రోడ్డు పలు చోట్ల కోతకు గురైంది. దీంతోపాటు మదుములు ధ్వంసమై రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. ఈ మార్గంలో మొత్తం 14 మదుములు ఉండగా, వాటిలో అయిదింటికి రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. రత్నంపేట నుంచి శరభవరం వచ్చే మార్గంలో కల్వర్టులు దెబ్బతిన్నాయి. గుర్రంపేట నుంచి కె.నాయుడుపాలెం మార్గంలో అల్లువారి పాకల వద్ద మదుము రక్షణ గోడ దెబ్బతింది. ఈ మార్గంలో ప్రయాణాలు చేసే వారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

**ఇటీవల జరిగిన ప్రమాదాలు...**

- కుసుర్లపూడి మార్గంలో ఏడాది క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి రోలుగుంట తమరాన వారి పాకల వద్ద బోల్తా పడి గాయపడ్డాడు.
- కొండపాలెం వెళ్లే రూటులో రెండు మాసాల క్రితం అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు గాయపడ్డారు.
- మూడేళ్ల క్రితం తుపాను ప్రమాదంలో శరభవరం–వడ్డిప మార్గంలో మొండి గెడ్డపై నీటి ప్రవాహం తీవ్రత వల్ల ఒక వ్యక్తి కొట్టుకుపోయి మృతి చెందాడు.
- కోతకు గురయిన రోడ్ల వద్ద మదుములు, రక్షణ గోడలు లేక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారుల్లో చలనం లేదు.

సంబంధిత అధికారులు తక్షణమే ఈ సమస్యలపై దృష్టి సారించి అవసరమైన నిర్మాణ పనులు చేపట్టి ప్రమాదాలు నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

### శిథిలమైన వంతెన రక్షణ గోడలు



పెద్దిపాలెం వద్ద శిథిలమైన ఏలేరు కాలువ వంతెన రక్షణగోడ

మాకవరపాలెం: శిథిలమైన వంతెన రక్షణగోడలు ప్రమాదకరంగా మారాయి. మండలంలోని పెద్దిపాలెం, లచ్చన్నపాలెం, రామన్నపాలెం వద్ద ఏలేరు కాలువతోపాటు గెడ్డలపై వంతెనల రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఏ మాత్రం అదుపుతప్పినా కాలువ, గెడ్డల్లో పడి ప్రాణాలు కోల్పోక తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటుగా పాఠశాలలకు అధిక సంఖ్యలో విద్యార్థులు వెళుతుంటారని, ఏ సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటాయోనని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రక్షణగోడలకు మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### రక్షణ గోడలు లేక ప్రమాదాలు



కొన్ని రహదారుల వద్ద శిథిలమైన మదుములు, దెబ్బతిన్న రక్షణ గోడలు కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ప్రమాదాల సంఖ్య పెరగక ముందే రక్షణ గోడలు నిర్మించాలి.

– కర్రి వీరునాయుడు, రోలుగుంట పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, కొండపాలెం గ్రామం

### కొత్త మదుములు నిర్మించాలి



రహదారుల మధ్యలో నిర్మించిన మదుములు పలు చోట్ల ధ్వంసమయ్యాయి. ఇవి రోడ్డుకు సమాంతరంగా ఉండటంతో నీరు చేరుతోంది. దాంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. కొత్త మదుములు నిర్మించి రవాణా మార్గం మెరుగు పరచాలి.

– వేల్పుల రమణ, కొండపాలెం, రోలుగుంట మండలం

### సమస్యలపై స్పందిస్తాం

శిథిల మదుములు, దెబ్బతిన్న రక్షణ గోడల సమస్య తెలుసుకుంటాం. మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటిస్తాం. దెబ్బతిన్న మదుములు, రక్షణ గోడల జాబితాను తయారు చేస్తాం. వాటి నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారుకు నివేదిస్తాం.

– జయరాజ్, జేఈ, ఆర్‌అండ్‌బీ నర్సీపట్నం డివిజన్

### ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నర్సీపట్నం: స్థానిక బీసీ హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సోమవారం నిర్వహించారు. డివిజన్ కార్యదర్శి జనార్దన్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌతం ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. గౌతం మాట్లాడుతూ 1970 డిసెంబర్ 30న కేరళలో ఆవిర్భవించిన ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. నాయకులు విజయ్, భూషణ్, సభ్యులు రవి, భార్గవ్, ప్రవీణ్, గణేష్, వరహాలబాబు, సత్యనారాయణ దుర్గా, మోహన్, సాయి పాల్గొన్నారు.

### విద్యుత్ స్తంభం ఏర్పాటు



విద్యుత్ స్తంభం వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురం తాచేరు నది సమీపంలో సూరిశెట్టి పొలంలో విద్యుత్ స్తంభాలు లేక కిందకు వేలాడుతున్న తీగలు సమస్యను ట్రాన్స్‌కో అధికారులు సరిచేశారు. సెప్టెంబరు 16న సాక్షి దినపత్రికలో 'పొలాల్లో యమపాశాలు' అనే కథనంపై మండల విద్యుత్ ఏఈ స్పందించారు. చెరకు తోటల మధ్యలో విద్యుత్ తీగలను పరిశీలించి సోమవారం సాయంత్రం స్తంభం వేసి సరిచేశారు. గ్రామ రైతులు వెంకట్రావు, రాము, సూరిబాబు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

## వినికిడి పరికరాలకు 40 మంది గుర్తింపు



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ సుధాశారద, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి

నర్సీపట్నం: వినికిడి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారికి స్థానిక జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో (డీఈఐసీ) ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.వి.సుధాశారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టకతో గానీ, ఎదుగుదల క్రమంలో గానీ వినికిడి సమస్య ఇతర లోపాలు ఉన్న వారిని త్వరగా గుర్తించడలో వైద్య సిబ్బంది దృష్టి సారించాలన్నారు. తద్వారా అవసరమైన చికిత్సా పద్ధతులతో మంచి ఆరోగ్య భవిష్యత్ అందిస్తే, వారికి జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. దీన్ దయాళ్ శ్రవణ ఫౌండేషన్ సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించి వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్నామని, వీరిలో అవసరమైన వారికి వినికిడి యంత్రాలను ఫౌండేషన్ వారు ఉచితంగా అందజేస్తారన్నారు. ఈఎన్టీ స్పెషలిస్ట్ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ మహాలక్ష్మి, వివిధ మండలాల మెడికల్ ఆఫీసర్లు ప్రసన్న, కీర్తి, ధనుంజయ్ రోగులను పరీక్షించి వినికిడి స్థాయిని నిర్ధారించి 40 మందిని ఎంపిక చేశారు. మంగళవారం కూడా శిబిరం కొనసాగుతుందని కోఆర్డినేటర్ తెలిపారు. ఎంపీహెచ్‌వో రమణబాబు, బాలల సత్వర చికిత్స కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మీదేవి



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీదేవి, డీవీఎంసీ సభ్యుడు రమణ

దేవరాపల్లి: చట్టాలు, పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ పి.లక్ష్మీదేవి తెలిపారు. పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వాకపల్లిలో గ్రామస్తులకు పౌర హక్కుల రక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వీటిని ప్రోత్సహించిన వారు సైతం శిక్షార్హులవుతారన్నారు. జిల్లా విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ(డీవీఎంసీ) సభ్యుడు కె.వి.రమణ మాట్లాడుతూ సమాజంలో అసమానతలను తొలగించడమే ధ్యేయంగా డాక్టరు బీఆర్. అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. సాగు భూములు ఇవ్వాలని, స్వయం ఉపాధికి రుణాలు మంజూరు చేయాలని పలువురు స్థానికులు కోరారని, ఈ విషయాలన్నీ త్వరలో జరిగే డీవీఎంసీ సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వో జామయ్య, కె.కోటపాడు సాంఘిక సంక్షేమ శాఖ వార్డెన్ గంగునాయుడు, జనసేన నాయకులు గుమ్మడి శ్రీరామ్, సానబత్తు సూర్యనారాయణ, రాజు, చిన్నారావు, లీలావతి తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ప్రణాళిక



మాట్లాడుతున్న జేఈ చంద్రమౌళి

నాతవరం: సరుగుడు, సుందరకోట పంచాయతీ శివారు 16 గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని నాతవరం విద్యుత్ శాఖ జేఈ చంద్రమౌళి సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా చేసేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేశామన్నారు. కొండల మీదనున్న గిరిజనుల ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లు, ఇతర సామగ్రి సరఫరా చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామన్నారు. 53 మంది గిరిజనులకు విద్యుత్ మీటర్లు, సరుగుడు నుంచి సుందరకోట వరకు నాలుగు కిలోమీటర్లు మేర కొత్తగా విద్యుత్ స్తంభాలు అవసరంగా గుర్తించామన్నారు. వీటిని త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఐరన్ స్తంభాలు శిథిలం కావడంతో వాటి స్థానం లో కొత్తవి వేస్తామన్నారు. మండల వ్యాప్తంగా 24 గంటల విద్యుత్ అందించేందుకు కొత్తగా లైన్లు ఏర్పాటు చేశామన్నారు.

## నీటి సంఘం ఎన్నిక నిర్వహించాలని వినతి



డీటీ అప్పారావుకు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ సత్య వెంకటరమణ

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో నిలిచిపోయిన నీటి సంఘం ఎన్నికను తక్షణమే నిర్వహించాలని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానిక రైతులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ కె. అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ఈ నెల 14న నీటి సంఘం ఎన్నికలు జరగ్గా ఎ. కొత్తపల్లి రెడ్డివాని పెద్దివాని చెరువు ఎన్నికను అధికారులు అర్ధాంతరంగా నిలిపివేశారన్నారు. నిలిచిపోయిన నీటి సంఘాల ఎన్నికలను మరలా నిర్వహించేందుకు గాను ప్రభుత్వ నోటిఫికేషన్ రావాలని డీటీ తెలిపారు. కంచిపాటి వెంకటరమణ, పెద్దాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

### ఇరువర్గాల ఘర్షణలో 8 మందిపై కేసు

బుచ్చెయ్యపేట: మండలంలోని దిబ్బిడి గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలో 8 మందిపై కేసు నమోదు అయింది. గ్రామానికి చెందిన శానాపతి మణికంఠ, గొంప రాజేష్‌ల మధ్య డబ్బుల విషయమై వివాదాలు ఉన్నాయి. సోమవారం సాయంత్రం వడ్డాదిలో తారసపడిన వీరు డబ్బుల విషయమై గొడవకు దిగారు. రాత్రి వరకు ఇది చినికిచినికి పెద్దదై ఇరువర్గాల వారు కర్రలు, రాళ్లతో దాడులకు దిగారు. దాంతో పలువురికి గాయాలవగా చోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

### విద్యుత్ చార్జీలు తగ్గించాలని ర్యాలీ




మాడుగులలో ర్యాలీ చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి నర్సింహమూర్తి, తదితరులు

మాడుగుల రూరల్: పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం మాడుగులలో పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచిపెట్టారు. పార్టీ మండల కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.9,412 కోట్లు ఇంధన సర్దుబాటు చార్జీలు ప్రజలపై మోపడం దారుణమన్నారు. మద్యం ధరలు తగ్గించి, మరో వైపు విద్యుత్ చార్జీలు పెంచడం సిగ్గుచేటన్నారు. నాయకులు కె. భవానీ, పాలకొండ అయ్యప్ప, రాజేష్ పాల్గొన్నారు.

### నేడు రెస్టారెంట్లలో మద్యం విక్రయిస్తే చర్యలు

చోడవరం: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా దాబాలు, రెస్టారెంట్లలో మద్యం అమ్మకాలు, సేవించడం చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ పి. అప్పలరాజు హెచ్చరించారు. ఈ నెల 31వ తేదీ రాత్రి 12 గంటల తర్వాత ఆకతాయిలు మోటారు సైకిళ్లపై తిరుగుతూ హడావిడి చేస్తే అరెస్టులు చేస్తామని హెచ్చరించారు.

## ప్రతి ఖైదీలో పరివర్తన రావాలి

- సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షేయాజ్ ఖాన్



ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షేయాజ్ ఖాన్

నర్సీపట్నం: జైలుకు వచ్చిన ప్రతి ఖైదీ ప్రవర్తనలో పరివర్తన రావాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షేయాజ్ ఖాన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పదే పదే తప్పులు చేసి జైలుకు రావటం వల్ల కుటుంబాలు ఇబ్బంది పడతాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని నడుచుకోవాలని ఖైదీలకు సూచించారు. బెయిల్ పెట్టుకునేందుకు కానీ కేసును వాదనకు ఆర్థిక స్తోమత లేనివారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలను అందిస్తామన్నారు. తిరిగి తప్పులు చేయకుండా జాగ్రతపడాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మధుసూదన్‌రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రోహిత్, న్యాయవాది ఎం.గోవర్ధన్‌గిరి పాల్గొన్నారు.

## నూతన సంవత్సరానికి వినూత్న స్వాగతం



కె.కోటపాడు: స్థానిక అయ్యన్న ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థులు ముందస్తుగా నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. సోమవారం ఇక్కడ 2025 అంకెల రూపంలో నిల్చొని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

నర్సీపట్నం: అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయీస్ యూనియన్ ఆర్టీసీ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి సోమవారం స్థానిక డిపో గేటు వద్ద ధర్నా నిర్వహించారు. రన్నింగ్ టైమ్‌లు దాటినటువంటి రూట్లో సర్వేలు జరిపి కచ్చితమైన రన్నింగ్ టైంలను అమలు చేయాలని, సిక్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్యారేజీ ఉద్యోగుస్తుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అధికారుల ఏకపక్ష నిర్ణయాలపై తగు విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీత

- చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్



మాడుగులలో పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజారామ్

చోడవరం రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపకరిస్తాయిని చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేది మొదట ఉపాధ్యాయుడేనని అన్నారు. ఇక్కడ ఉత్తమంగా నిలిచిన నమూనాలు జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికవుతాయని ఎంఈవోలు ఎస్.తిరుపతిరావు, కె.సింహాచలం తెలిపారు. మండలంలోని 14 ఉన్నత పాఠశాలల నుంచి 87 మంది విద్యార్థులు 54, ఉపాధ్యాయులు 12 వెరసి 66 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్లాస్టిక్ వినియోగం, విద్యుత్ ఆదా, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, సాంప్రదాయ, సాంప్రదాయేతర వనరులు వంటి పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. విజేతలందరికీ బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.



విజేత విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహుమతులు ఇస్తున్న ప్రిన్సిపాల్

**విద్యార్థి దశ నుంచి శాస్త్ర, సాంకేతిక విద్యపై ఆసక్తి**

మాడుగుల: విద్యార్థి దశ నుంచి శాస్త్ర, శాంకేతిక విద్యపై ఆసక్తి పెంపొందించడానికే సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నారని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహించారు. 14 హైస్కూళ్ల నుంచి 42 మంది విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు. వీటిని ఎంఈవో–2 బి. దేముడమ్మతో కలిసి ఆయన తిలకించారు. ప్రతి విద్యార్థి నైపుణ్యం పెంపొందించుకుని శాస్త్రవేత్త కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆటోమిటిక్ లైట్ సిస్టమ్, ప్రోసీసింగ్ ఆఫ్ గ్యాస్ లీకేజీ, సోలార్ సిగ్నల్ సిస్టమ్, హార్వెస్టింగ్ ప్లాంట్, సోలార్ లైటింగ్ తదితర అంశాలుపై ప్రయోగాలు అద్భుతంగా ఉన్నాయని విద్యార్థులను అభినందించారు. నలుగురు విద్యార్థుల నమూనాలు ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది రాజు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**వైజ్ఞానిక ప్రదర్శనలతో విజ్ఞానం పెంపు**



నమూనాలును ఎంఈవో దేముడమ్మతో కలసి పరిశీలిస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

కె.కోటపాడు: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఆయన ప్రారంభించి విద్యార్థులు తయారీ చేసిన నమూనాలను తిలకించారు. కె.కోటపాడు, గొండుపాలెం, చౌడువాడ, మేడిచర్ల, ఎ.కోడూరు, కొరువాడ, పాతవలస, కేజీబీవీ పాఠశాలల నుంచి 40 నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. కె.కోటపాడు హైస్కూల్ విద్యార్థులు గ్రీన్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్, పాతవలస పాఠశాల విద్యార్థులు వివిధ దశల్లో నీటిశుద్ధిని చేసే ప్రదర్శన, వృక్ష కణం, కిరణ జన్య సంయోగక్రియ, మానవ హృదయం పని చేసే విధానంపై తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి బహుమతులను అందించారు. ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, హెచ్ఎంలు పద్మావతి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: వడ్డాది హైస్కూలులో మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థుల విభాగంలో మీనాక్షి టీమ్ ప్రతిభ చూపింది. వీరికి గైడ్ టీచరుగా టి. సునీత, సిహెచ్ శ్రీను వ్యవహరించారు. గ్రూపు విభాగంలో ఎస్. సోము, సత్య, సాయి, కుసుమ, గైడ్‌గా వి. హేమలత వ్యవహరించారు. విజేతలను ఎంఈవోలు అభినందించారు.



కె.కోటపాడులో ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థులు



చోడవరంలో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన



వడ్డాది హైస్కూలులో నమూనాల ప్రదర్శన